## క్లుప్తంగా

### మండలస్థాయి ఆటల పోటీలు

తూములూరు(కొల్లిపర): తూములూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండలస్థాయి అండర్ 14, 17 బాల బాలికలకు ఎస్‌జీఎఫ్ ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ మండల కోఆర్డినేటర్ సమ్మెట సాంబశివరావు తెలిపారు. శుక్రవారం హైస్కూల్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6వ తారీకున కబాడ్డీ, కో–కో, వాలీబాల్, యోగా 7వ తారీకున కొల్లిపర గ్రామంలోని అవుతురామిరెడ్డి జూనియర్ కాలేజీ ఆవరణలో అథ్లెటిక్స్ జరుగనున్నట్లు వివరించారు. ఈ మండలస్థాయి గేమ్స్ నందు ప్రభుత్వం, ఎయిడెడ్, రికగ్నైజ్డ్ కలిగిన పాఠశాలలు పాల్గొనుటకు అనుమతి ఉందని కావున మండలంలోని ఆసక్తి కలిగిన పాఠశాల విద్యార్థులు పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొల్లాటి నాగలక్ష్మి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యావేత్త ప్రియా పొంగురుకు సత్కారం



తెనాలిటౌన్: వెస్ట్‌బెంగాల్‌లోని క్రెడ్ మౌంట్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత్రి ప్రముఖ విద్యావేత్త ప్రియా పొంగురును గురువారం రూరల్ మండలం నందివెలుగు శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో ఘనంగా సత్కరించారు. విజయదశమి సందర్భంగా ఆమె అమ్మవారి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించి ఆమెను దుశ్శాలువా మెమోంటోతో సత్కరించారు. గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్, ఆలయ ఈవో గోవర్ధనరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు

తెనాలిరూరల్: గాంధీ జయంతి రోజున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. పట్టణంలో గురువారం ఇద్దరు వ్యక్తులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండడం ఎక్సైజ్ అధికారుల దృష్టికి వెళ్లింది. ఇఒద్దరు వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్టు తెనాలి ఎక్సైజ్ సీఐ ఏవీ చలం తెలిపారు.

### భక్తులకు అన్నదానం



తెనాలిఅర్బన్: రామలింగేశ్వరపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధరణికోట మల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, కుర్రా సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు గుంటూరు గోపి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### శివశంకర్‌కు సేవామౌళి పురస్కారం



తెనాలిఅర్బన్: సత్యం, శివం, సుందరం సంస్థ వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్‌కు సేవామౌళి పురస్కారాన్ని గురువారం భాష్యకార సమాజం సంస్థ సభ్యులు ప్రదానం చేసి సన్మానించారు. భాష్యకార సమాజం వ్యవస్థాపకులు వెంకట దాసాస్వామి 130వ జయంతిని బాపట్ల జిల్లా, నగరం మండలం, పూడివాడ గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మొవ్వ ఉషాద్రిపతి, మొవ్వ సరోజన నాభుడు, మొవ్వ వెంకట నగరాయులు, వేణుపాణి, పద్యాల గోపి చంద్ర స్వామి, తన్నీరు కమలాదేవి పాల్గొన్నారు.

### సమాధుల తోటకు స్థలం కేటాయించాలి




తెనాలిఅర్బన్: పట్టణంలో క్రైస్తవుల సమాధుల తోట ఇరుకుగా ఉండటం వలన అనేక ఇబ్బందులు పడుతున్నామని ఐతానగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ సమాధులతోట సాధన కమిటీ ఆధ్వర్యంలో ఐతానగర్‌లో గురువారం రాత్రి సంతకాలు సేకరణ నిర్వహించారు. అధికారులు స్పందించి స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సునీల్ సందీప్, వంపుగ్గ్ల సురేష్, బొనిగల ప్రసాద్, జ్యోతుల శేషు, చేబ్రోలు విజయ్‌కుమార్, పరిశుద్ధరావు, తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరపేటలోని రామేశ్వరాలయంలో అమ్మవారికి శ్రీ పుష్పశయయనిగా..



మారీస్‌పేట శివాలయంలో అమ్మవారు శ్రీ పుష్పశయయనిగా..



శ్రీ పుష్పశయనిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



కఠెవరంలో రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు



నందివెలుగులో రాజరాజేశ్వరి దేవిగా కనకదుర్గాదేవి

# పలుకు తేనెల తల్లి పవళించెను...

తెనాలి /కొల్లిపర/తెనాలిటౌన్: దసరా పర్వదినంలో భాగంగా జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. పలు దేవాయాల్లో అమ్మవారు శ్రీ పుష్పశయనిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మండల వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున విజయదశమి పండుగ భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలో వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, అత్తోట వివిధ గ్రామాల్లో భక్తులు అమ్మవారి ఆలయాల్లో భక్తులు అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అమ్మవారిని, ఆంజనేయ, ఈశ్వర స్వాముల ఉత్సవ విగ్రహాలను అడ్డపల్లకీలో జమ్మి వృక్షం వరకు ఊరేగించారు. అనంతరం జమ్మి వృక్షాల వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. కొల్లిపర గ్రామంలోని జనార్దన స్వామి వారి దేవాలయంలో అమ్మవారిని ప్రతేక అలంకారం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రూరల్ మండలం కఠెవరంలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అర్చకులు జాజుల జగదీష్, గురుభవానీ వెంకటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్థానిక రైల్వేస్టేషన్‌రోడ్డులోని శ్రీ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నందివెలుగులోని శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను గ్రామసర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్, ఆలయ ఈవో గోవర్ధనరెడ్డి, రాఘవేంద్ర, తదితరులు పర్యవేక్షించారు.



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న డబల్ హార్స్ మినపగుళ్లు అధినేత శ్యామ్‌ప్రసాద్, ఆర్యవైశ్య ప్రముఖులు



శివాజీ చౌక్‌లోని దసరా వేడుకల్లో నృత్య కళాకారులకు బహుమతులు అందజేస్తున్న రమేష్



కొల్లిపరలో అమ్మవారికి ప్రత్యేక అలంకారంతో పూజలు నిర్వహించిన భక్తులు



రైల్వేస్టేషన్ రోడ్డులో రాజరాజేశ్వరి దేవిగా దుర్గాదేవి అమ్మవారు

## బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామలింగాచారి



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రాధిక



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శివకుమార్

- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- ఘనంగా మహాత్ముడికి నివాళి

తెనాలి: సత్యం, అహింస ఆయుధాలుగా సువిశాలమైన భారతదేశానికి స్వాతంత్య్రం సాధించిన పూజ్య బాపూజీ మహాత్ముడు అయ్యాడని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం మహాత్మాగాంధీ జయంతిని గాంధీచౌక్ వద్ద నిర్వాహించారు. అక్కడ ఉన్న ఆయన విగ్రహానికి శివకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ ఆదర్శాలు, ఆలోచనలను ఆచరణలో పెట్టగలిగితే శాంతి నెలకొంటుందని చెప్పారు. గాంధీజీ ఔన్నత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు దేసు శ్రీనివాసరావు, మద్దాళి శేషాచలం, వుప్పల వరదరాజులు, భాస్కరుని శ్రీనివాసరావు, చక్కా చంద్రమోహన్, నూకల ఆదిత్య, కొమ్మంద్రు మణిదీప్, చుండూరు సాయి, కొల్లా గురునాథ్ గుప్తా, వేమా సురేష్‌బాబు, ఆతుకూరి పూర్ణచంద్రరావు, కొమ్మూరి కృష్ణ, ముప్వల శ్రీనివాసరావు గుప్త, యిడవలపాటి వాసు, నేరెల్ల శ్రీకాంత్, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, పార్టీ నాయకులు బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, గొడవర్తి హరేరామ్, పెదలంక వెంకటేశ్వర్లు, నీలి అజయ్, చుండూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో..**

తెనాలి: మహాత్మాగాంధీ 156వ జయంతిని బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ, కస్తూర్బాగాంధీ దంపతుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూజ్యబాపూజీ సిద్ధాంతాలు ప్రపంచ మానవాళికి శిరోధార్యాలుగా చెప్పారు. సత్యం, అహింస దివ్య సాధనాలుగా తెలిపారు. గత 21 సంవత్సరాలుగా ఆశ్రమ నిర్వహణకు సహకరిస్తున్న దాతలు, ధర్మకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. 156 కిలోల పప్పు చెక్క ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గుంటూరు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**తెనాలి పురపాలక సంఘ ఆవరణలో...**

తెనాలిఅర్బన్: పూజ్యబాపూజీ త్యాగాన్ని భారతీయులు స్మరించుకోవాలని తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం తెనాలి పురపాలక సంఘ ఆవరణలోని మహాత్మాగాంధీ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల బానిస సంకెళ్ల నుంచి దేశానికి స్వాతంత్య్రం లభించిందంటే అందుకు గాంధీ అహింసాయుతంగా చేసిన ఉద్యమమే కారణమన్నారు. గాంధీజీ ఔన్నత్యాన్ని, ఆయన చేసిన స్వాతంత్య్ర పోరాటాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో 38వ వార్డు కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, మునిసిపల్ ఇంచార్జి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ మొవ్వా యేసుబాబు, ఆర్వో రాంప్రసాద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్త్రీ పాత్రలో తనకు తానే సాటి బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి

- ఆయన స్థాయికి తగిన అవార్డు రాలేదు
- వీణా అవార్డ్స్ ముగింపు సభలో ఆచార్య అప్పాజోస్యుల
- ఉప్పలపాడు సైదులుకు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి అవార్డు ప్రదానం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

తెనాలి: స్త్రీ పాత్ర పోషణలో తనకు తానే సాటి అనిపించుకున్న ప్రఖ్యాత రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి బహుముఖీనమైన ప్రజ్ఞ కలిగిన వారని అజో విభో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. కళల కాణాచి, తెనాలి, ఆర్‌ఎస్‌ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో గత ఆరురోజులుగా జరుగుతున్న వీణా అవార్డ్స్–2025 ముగింపు సభ గురువారం రాత్రి జరిగింది. నాటకరంగ విశ్లేషకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. సభలో బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని మరో ప్రముఖ నటుడు ఉప్పలపాడు సైదులుకు బహూకరించారు. విశిష్ట అతిథి ఆచార్య సత్యనారాయణ మాట్లాడుతూ స్త్రీ పాత్రలో 'స్థానం' తర్వాత అంత గొప్పగా స్త్రీ పాత్రను పోషించే సుబ్రహ్మణ్యశాస్త్రిలో స్థానంలో లేని ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ఆయన స్థాయికి తగిన అవార్డులు రాకపోవటం విచారకరమన్నారు. పద్య నాటకాలు మెరుగవుతుండటం సంతోషకరమైన అంశంగా చెప్పారు. నాటకంపై తపనతో ఒక యజ్ఞలా నిర్వహిస్తున్న వీణా అవార్డ్స్ నిర్వాహకులను అభినందించారు. ప్రముఖ సినీమాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ, యువత చేతిలోనే నాటకం భవిష్యత్ ఉందన్నారు. యువతరం నాటకాల్లోకి రావాలని, అందుకే వీణా అవార్డ్స్‌లో యువనటులకు అవకాశాల్లో వెసులుబాటు కల్పించటం, ప్రత్యేక బహుమతులను ప్రవేశపెట్టామని చెప్పారు. డాక్టర్ కందిమళ్ల మాట్లాడుతూ, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి రంగస్థలంపై నటవిశ్వరూపం అన్నారు. తాను పోషించే పాత్రల భంగిమలు, హావభావాలను ముందుగా చిత్రించుకుని, ఆ తర్వాత రంగస్థలానికి వెళ్లేవారని చెప్పారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ కళల ప్రాముఖ్యతను తెలియజెప్పారు. ఆర్‌ఎస్‌ఆర్ గ్రూప్స్, హైదరాబాద్ చైర్మన్ ఆర్.శ్రీకాంత్‌రెడ్డి తన ప్రసంగంలో, వీణా అవార్డ్స్‌కు తగిన ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. ప్రముఖ రంగస్థల నటులు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, బుర్రా జయలక్ష్మి అవార్డుగ్రహీత ఉప్పలపాడు సైదులు నటవిశిష్టతను తెలియజేశారు. వీజీకే అండ్ వీవీఎల్ ఫౌండేషన్ కోశాధికారి తుమ్మల కిషోర్, వాసిరెడ్డి బెస్ బాబు ప్రభృతులు పాల్గొన్నారు.

## తెనాలిలో పలుచోట్ల అన్నసంతర్పణ



దేవిచౌక్‌లో అన్నదానం చేస్తున్న శివరామప్రసాద్, రత్నాకర్ శాస్త్రి



సాయిబాబా గుడివద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తెనాలి: దసరా ముగింపు ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వరపేటలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానం వద్ద గురువారం అన్నసంతర్పణ చేశారు. ఆలయ చైర్మన్ టీవీఎస్ శాస్త్రి, లలిత కామేశ్వరి దంపతులు, కొండపి శ్రీనివాసరావు, వసుంధర దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షుడు చివుకుల శివరాంప్రసాద్, కార్యదర్శి విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి, దారా బాలకృష్ణమూర్తి, పరిమి నటరాజ్, పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

- శ్రీ షిరిడీ సాయిబాబా పుణ్యతిథి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రామలింగేశ్వరపేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిర సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టినవారిని అరెస్టు చేయాలి

**అమృతలూరులో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో రాస్తో రోకో**

అమర్తలూరు(వేమూరు): భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన దుండగులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యూత్ సభ్యులు డిమాండ్ చేశారు. చుండూరు మండల కేంద్రంలో శుక్రవారం రాస్తోరోకో నిర్వహించారు. గంట సేపు బస్సుల రాకపోకలు నిలిపివేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యూత్ సభ్యులు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా దేవళంపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కొందరు నిప్పు పెట్టారని, వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో దళితులు, అంబేడ్కర్ విగ్రహాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. అంబేడ్కర్ విగ్రహాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసేంతవరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



అమర్తలూరు సెంటరులో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

## బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్

తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా జాగారపు రామ అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించి పలు ఫైల్స్‌పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారంతో తెనాలి పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. పట్టణంలో పారిశుధ్య మెరుగుదల పై ప్రత్యేక శ్రద్ధ చూపనున్నట్లు చెప్పారు. అనంతరం చైర్‌పర్సన్ రాధికను ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

### నల్గొండ జిల్లాలో తెనాలి వాసి మృతి



తెనాలిరూరల్: తెలంగాణలోని నల్గొండ జిల్లాలో తెనాలి వ్యక్తి మృతి చెందాడు. మేనల్లుడిని కాపాడే క్రమంలో నదిలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక చినరావూరుకు చెందిన కేతావత్ రామునాయక్ (34) తన కుటుంబ సభ్యులతో దసరా కొలుపులకు తెలంగాణలోని నల్గొండ జిల్లా దేవరచర్ల గ్రామంలోని తన బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలసి వెళ్లాడు. దసరా పండుగ కొలుపులను వీక్షించి తన మేనల్లుళ్లతో కలసి గ్రామ సమీపంలోని నదీ తీర ప్రాంతానికి వెళ్లాడు. తనతో వచ్చిన మేనల్లుడు ఉమాకాంత్ (10) నదిలో జారి కొట్టుకుపోతుండగా కాపాడేందుకు రామునాయక్, అతని బంధువు పూర్ణగోపాల భరత్‌నాయక్ నదిలోకి దూకారు. బాలుడి ఆచూకీ తెలియలేదు. అతన్ని కాపాడేందుకు నదిలోకి దూకిన ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. చినరావూరు చెందిన రామునాయక్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహం శుక్రవారం సాయంత్రం తెనాలికి చేరుకుంది.

### పూరిల్లు ఆహుతి



దావులూరిపాలెం(కొల్లిపర): విద్యుదాఘాతంతో పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైన సంఘటన గురువారం మండలంలోని దావులూరిపాలెంలో చోటుచేసుకుంది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన తల్లి కుమార్తె లైన దేవరకొండ మంగమ్మ, మిడ్దే నగ్మా కి చెందిన రెండు పోర్షణ్లతో కూడిన పూరిల్లు అగ్నికి ఆహుతైంది. తల్లి, కూతురు ఇద్దరూ కట్టుబట్టలతో మిగిలిపోయారు. ఆ సమయంలో కూతురు పిల్లలు ఇంటిలో లేక పోవటం వలన ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. వైఎస్సార్‌సీపీ పార్టీకి చెందిన బీసీ సంఘం నాయకుడు మోర్ల శ్రీను(లాగుల శ్రీను) ఈ విషయం తెలుసుకుని తన సహచరులతో సంఘట స్థలాన్ని పరిశీలించి తన వంతు సాయంగా వారికి రూ.10వేలు సాయం అందించాడు. గ్రామస్తులు మాట్లాడుతూ సర్వం కోల్పోయిన తల్లి, కూతుర్లను స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.